క్లుప్తంగా

ఘనంగా ఏపీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

అడవిదేవులపల్లి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ జన్మదిన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభిమానులు కొత్త శౌరెడ్డి, తోట వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, గోపి, మనోహర్, మధు, జగన్ యూత్ మండల అభిమానులు తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కొండమల్లేపల్లి : దేవరకొండ ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో 9959226311కు ఫోన్ చేసి ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు అందజేయాలని సూచించారు.

అయోధ్య రామాలయ అక్షింతల ఊరేగింపు



అక్షింతల కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మిర్యాలగూడ టౌన్ : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మిస్తున్న రామాలయం నుంచి అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్ట్ ద్వారా వచ్చిన అక్షింతల కలశాలు గురువారం పట్టణానికి చేరాయి. ఈ సందర్భంగా అక్షింతల కలశాలను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు వ్యాపారి కుశలవ్‌కుమార్, ఉమాకర్ రెడ్డి, చిలుకూరి శ్యాం, చెరుపల్లి కరుణాకర్, సుధాకర్, మదన్‌మోహన్ తదితరులున్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

డిండి : మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే ఆ పార్టీ మండల కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి గురువారం ఒక ప్రకటనలో సభ్యులను కోరారు. ఈ సమావేశంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

గుర్రంపోడు : మండలంలోని తేనపల్లి గ్రామంలో గురువారం కొ్ట్ర భిక్షమయ్య అనే రైతుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తుండగా ఎర్త్‌వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు విద్యుత్ అధికారులను కోరారు.

ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

నిడమనూరు : మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తూ అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం మండల ఏఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, కోమండ్ల గుర్వయ్య, చంద్రశేఖర్, చరణ్‌రాజ్, పుల్లయ్య, బొడ్డు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

హాలియా : మండలంలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన షేక్ మైబెల్లి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు నిరుపేద కావడంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రామంలో విరాళాలు సేకరించి రూ.71,223ల నగదును గురువారం బాధితుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆంజాద్‌ఖాన్, కొండల్, సాయి ఉన్నారు.

మా డబ్బులు తిరిగివ్వండి సారూ..

గొర్రెల పథకం లబ్ధిదారుల వేడుకోలు

- డీడీలు తీసి నెలలు గడుస్తున్నాయి
- వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన
- ఇప్పటికీ పూర్తికాని మొదటి విడత



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధి కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీకి 2017లో శ్రీకారం చుట్టింది. 18సంవత్సరాలు నిండిన ప్రతి గొల్ల, కురుమలను లబ్ధిదారుడిగా ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో సంఘాలను ఏర్పాటు చేసుకొని, సంఘాలను రిజిస్టర్ చేయించుకున్నారు. మండల వ్యాప్తంగా 2005మంది లబ్ధిదారులుగా అధికారులు తేల్చారు. రెండు విడతలుగా పంపిణీ చేపడతామని ప్రభుత్వం పేర్కొనడంతో మొదటి విడతలో కొన్ని గ్రామాల్లో లాటరీ పద్ధతిన, మరికొన్ని గ్రామాల్లో కుటుంబాల వారిగా తీసుకున్నారు. దీంతో మొదటి విడతలో భాగంగా 1001 మంది ఎంపిక చేశారు. వారిలో మొదటి విడతలో ఇప్పటి వరకు 939మందికి మాత్రమే గొర్రెల యూనిట్లు అందగా ఇంకా మండలంలోని చింతలపాలెం గ్రామంలో 62యూనిట్లను మొదటి విడతగా అందించాల్సి ఉంది.

ఒకొక్కరూ రూ.43,750 చెల్లింపు..

మొదటి విడతలో భాగంగా ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలుకు నాడు రూ.1.25 లక్షలు విలువ చేస్తే అందులో లబ్ధిదారుడు 25శాతం తన వాటాగా రూ.31,200 డీడీ రూపంలో చెల్లించగా మిగతా 75శాతం ప్రభుత్వం ఉచితంగా అందించింది. గతంలో కంటే ప్రస్తుతం గొర్రెలకు రేట్లు పెరగడంతో యూనిట్ ధరను ప్రభుత్వం రూ.1.75లక్షలకు పెంచింది. అందులో లబ్ధిదారుల వాటా రూ.43,750 కాగా పెరిగి మిగతా మొత్తం ప్రభుత్వం లబ్ధిదారుడికి రాయితీ రూపంలో ఇస్తుంది. రెండో విడత ఎంపిక బాధ్యతను గత ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించడంతో సదరు ఎమ్మెల్యే మండలంలోని యల్లాపురం, గోడుమడక, చింతలపాలెం, అల్వాల గ్రామాలను ఎంపిక చేశారు. వీలైనంత త్వరగా డీడీలు తీయాలని లేకుంటే మీ స్థానంలో వేరే గ్రామాలను ఎంపిక చేస్తామని అధికారులు పేర్కొనడంతో నాలుగు గ్రామాల్లోని 216మంది లబ్ధిదారులు పది నెలల క్రితమే ఒకొక్కరూ రూ.43,750 చొప్పున కలెక్టర్ ఖాతాలో డీడీ రూపంలో జమచేశారు.

ప్రభుత్వం మారడంతో ఆందోళనలో లబ్ధిదారులు..

గొర్రెల పంపిణీ పథకాన్ని గత ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. గత ప్రభుత్వం, అధికారుల ఆదేశాలతోనే లబ్ధిదారులు రెండో విడతలో భాగంగా పది నెలల క్రితం డీడీలు తీశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో మిగిలి ఉన్న రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ పథకంపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో గొర్రెలు వస్తాయా? రావా? రాకుంటే మేము డీడీల రూపంలో చెల్లించిన డబ్బుల పరిస్థితి ఏమిటనేది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో విసిగెత్తిపోయిన లబ్ధిదారులు గొర్రెలు ఇవ్వకున్నా పర్వాలేదు కానీ, తాము చెల్లించిన డబ్బులు తిరిగి తమ ఖాతాల్లో జమ చేయాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

డీడీ తీసి పదినెలలు అవుతుంది



గత ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో రెండో విడతలో లబ్ధిదారుడిగా ఎంపికయ్యాను, తన వాటా కిందా పది నెలల క్రితమే రూ.43,750 డీడీ రూపంలో అప్పుతెచ్చి ప్రభుత్వానికి చెల్లించాను. డీడీ తీసి పది నెలలు గడుస్తున్నా నేటికి గొర్రెలను పంపిణీ చేయలేదు. తెచ్చిన అప్పు వచ్చిన గొర్రెలను అమ్మినా సరిపోయే పరిస్థితి కనబడటం లేదు. గొర్రెలు ఇవ్వకున్నా పర్వాలేదు కానీ తాను చెల్లించిన డబ్బులను అధికారులు తిరిగి తన ఖాతాలో జమ చేయాలి.

– పగడాల రాజశేఖర్, యల్లాపురం

అప్పు తెచ్చి డీడీలు తీశాము



ప్రభుత్వం గొర్రెలను ఇస్తామని చెపితే ఆశతో నాలుగు నెలల క్రితం అప్పు తెచ్చి ఒక్కో యూనిట్‌కు రూ.43,750 చెల్లించాం. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గొర్రెలు వచ్చింది లేదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం మాకు గొర్రెలను పంపిణీ చేయాలి.

– వస్త్రపురి మల్లీశ్వరావు, లబ్ధిదారుడు, చింతలపాలెం

పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ టౌన్ : పార్టీ కోసం పనిచేసే వారికి బీజేపీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలో పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అర్హత కలిగిన విశ్వకర్మలకు ఈ పథకం గురించి వివరించడంతో పాటు వారిలో చైతన్యం తీసుకరావాలన్నారు. ప్రతి పార్టీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంతో పాటు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్టీరింగ్ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన ఎడ్ల రమేష్ నియమితులు కావడంతో ఆయనను పార్టీ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో విశ్వకర్మ యోజన పథకం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిలుకూరి శ్యాం, కోకన్వీనర్ చిల్లంచర్ల అబీ, స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యప్రసాద్, సీతారాంరెడ్డి, నాగిరెడ్డి, యాదగిరిరెడ్డి, మూల రాజిరెడ్డి, పాతకోటి సైదులు, జానకిరాం రెడ్డి, మంద శివ తదితరులున్నారు.

దేశప్రతిష్టను దిగజారుస్తున్న ఇండియా కూటమి



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ : ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను అనుకరిస్తూ హాస్య ప్రదర్శన చేసి అవమానిస్తూ ఇండియా కూటమి దేశ ప్రతిష్టను దిగజారుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. పార్లమెంట్‌లో ఇండియా కూటమి చర్యల పట్ల గురువారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట బీజేపీ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవినీతి, స్కాములు లేకుండా భారతదేశాన్ని అత్యున్నత స్థానంలో నిలిపిన దేశ ప్రధానిని, కేంద్ర ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలని ఇండియా కూటమి చూస్తుందన్నారు. ఐటీ దాడిలో రూ.550కోట్లు దొరికిన కాంగ్రెస్ నాయకుడు దిరజ్ సాహు విషయంపై పార్లమెంట్‌లో చర్చ జరపకుండా కాంగ్రెస్ నాయకులు దేశ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో చిలుకూరి శ్యామ్, రేపాల పురుషోత్తం, కనపర్తి సత్యప్రసాద్, యాదగిరిరెడ్డి, మూల రాజిరెడ్డి, యాదమ్మ, సత్యనారాయణ, సైదులు, వేణు, రవి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

‘యూడైస్’లో సమాచారం నమోదు చేయాలి



గుర్రంపోడు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ తరి రాము



పెద్దవూరలో మాట్లాడుతున్న ఎంఈఓ రాము

గుర్రంపోడు : విద్యా ప్రణాళికకు సంబంధించి యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)లో ప్రధానోపాధ్యాయులు ఖచ్చితమైన సమాచారం నమోదు చేయాలని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూడైస్ ఆధారంగా భవిష్యత్‌లో పాఠశాలకు అవసరమైన నియామకాలు, నిధులు మంజూరు అవుతాయన్నారు. ప్రస్తుతం నెల రోజుల పాటు అమలు జరుగుతున్న అకడమిక్ బబుల్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలన్నారు. పాఠ్యపుస్తకం, వర్క్‌బుక్, పీరియడ్ ప్లాన్‌లను అనుసంధానించుకుని బోధన జరపాలన్నారు. ఇందులోని ఆరు అంశాలను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులను గ్రూపులను విభజించి టీచర్ సపోర్టు గ్రూపులోని విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన జరపాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పి.గీత, ఎ.యాదగిరి, కె.శ్రీనివాస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఇటికాల రమేష్, సీసీఓ యాట వెంకట్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

పెద్దవూర : విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని హెచ్‌ఎం తరి రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇండియా లిటరసీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు కేరీర్ ఎవర్నెస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. కష్టంతో కాకుండా ఇష్టంతో కూడిన ప్రణాళికతో చదవాలని అన్నారు. అనంతరం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు అధినేత మన్మోహన్, సిరికొండ అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ రికార్డులను సిద్ధం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ : మండలంలోని ప్రతి గ్రామపంచాయతీకి సోషల్ ఆడిట్ సిబ్బంది తనిఖీ చేయడానికి వస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు ఆడిట్ రికార్డులను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టెక్నికల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నర్సరీల్లోని బ్యాగుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటాలన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. ప్రతి నర్సరీకి వన సేవకులను నియమించి అన్ని మొక్కలు బ్రతికేలా సంరక్షించాలన్నారు. సమావేశంలో ఎంపీఓ టి.వీరారెడ్డి, ఈసీ కళావతి, పర్యవేక్షకులు పి.కరుణాకర్‌రావు, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, టీఏలు, ఎఫ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



దాతను సన్మానిస్తున్న మాలధారులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన దాతలు సముద్రాల అనూష–మహేశ్, లలిత –భీమ్‌సింగ్ దంపతులను మాలధారులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టెడి ప్రభాకర్ రెడ్డి, అయ్యప్ప మాలధారులు తోటపల్లి కృష్ణ, జయశంకర్, వెంకట్‌రెడ్డి, నరేష్, భక్తులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం డిపో డీఎం బొల్లెడ్డు పాల్ ఆర్టీసీ కళాకారులను సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. కళాకారులు తమ కళతో ఆర్టీసీకి ఆదాయం తీసుకువచ్చేందుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు తదితరులున్నారు.



కళాకారులను సన్మానిస్తున్న డీఎం పాల్

పెళ్లికానుక అందజేత



పెళ్లికానుక అందజేస్తున్న మాజీ ఎంపీపీ

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన వడ్డెగాని సైదులు సైదమ్మ దంపతుల కుమార్తె నవ్య వివాహం సందర్భంగా మాజీ ఎంపీపీ నామిరెడ్డి రవీనాకరుణాకర్‌రెడ్డి ఎన్‌ఎస్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కల్యాణలక్ష్మి కానుకగా రూ.6,116లు, చీరను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఆడబిడ్డ పెళ్లికి గ్రామ పెళ్లికానుక అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బారి లింగయ్య, పందుల సైదులు, రమణయ్య, జెర్రిపోతుల గిరిబాబు, రాములు, సుమన్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించుకోవాలి



హాలియాలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

హాలియా : నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ ఆడపిల్లలను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం స్థానిక కేజీబీవీ పాఠశాల్లో నిర్వహించిన బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలను రక్షించుకుందాం.. కాపాడుకుందామన్నారు. భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలన్నారు. ఆడపిల్లలు తమను తాము రక్షించుకునేలా ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడపిల్లలు అత్యవసర సమయంలో చిల్డ్రన్స్ హెల్ప్ లైన్–1098, మహిళా హెల్ప్‌లైన్–181, పోలీస్ హెల్ప్‌లైన్–100 నంబర్లను సంప్రదించాలన్నారు. పౌష్టికాహారంలో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం లైంగిక వేధింపులు, బాలికలు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, భ్రూణహత్యల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

శిశు విక్రయాలు, బాల్య వివాహాలు నేరం

త్రిపురారం: శిశు విక్రయాలు, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అడపిల్లలను రక్షించుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో దామరచర్ల ప్రాజెక్ట్ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాలికల అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని మాట్లాడారు. చిన్న పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తే 1098 నంబర్‌ను సంప్రదించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం కర్నాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విష్ణుకుమార్, అంగన్‌వాడీ టీచర్లు శైలజ, ఏల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం : సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిని

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం, అన్నప్రాసన

అడవిదేవులపల్లి : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని జిలకరకుంటతండాలో అక్షరాభ్యాసం, మొల్కచర్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో హ్యాండ్ వాష్‌డే, దూద్యతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జిలకరకుంటతండా పాఠశాల హెచ్‌ఎం కాశీయాదవ్, అంగన్‌వాడీ టీచర్లు టి.మనెమ్మ, డి.సరిత, రాణి, ఆయాలు కళావతి, సునీత, రోజా తదితరులున్నారు.



తిరుమలగిరి (నాగార్జునసాగర్) : చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ పాపిరెడ్డి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాపిరెడ్డి మాట్లాడారు. బాలింతలలో రక్తహీనతను తగ్గించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయకుమారి, పద్మ, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వార్డు మెంబర్లు పరశురాం, కొండలు, విమలమ్మ, అశ్విని బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేస్తున్న సిబ్బంది

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరాములు

పెద్దఅడిశర్లపల్లి : 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఓటరు జాబితా తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనవరి1 2024 నాటికి 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడానికి అర్హులన్నారు. ఓటరు జాబితా తయారీ, జాబితా మార్పులు, చేర్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కలెక్టర్‌చే ప్రశంసపత్రం అందుకున్న బీఎల్ఓ ముత్యాలమ్మను ఆర్డీఓ సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజకు ఏర్పాట్లు

పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ పట్టణంలో ఈనెల 23, 24తేదీల్లో నిర్వహించనున్న అయ్యప్ప మండల పూజ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అయ్యప్పస్వామి సేవా ట్రస్టు సభ్యుడు నీలా రవికుమార్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల పూజకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అయ్యప్పస్వామి సేవా ట్రస్టు సభ్యులు

యువత చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

పెద్దఅడిశర్లపల్లి : చట్టాలపై యువత అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగం – ఓటు హక్కు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకొని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలోని స్రవంతి స్కూల్ విద్యార్థి జి.అఖిల్ జాతీయ హాకీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

గుర్రంపోడు : మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి మాత్రమే వర్తింపజేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉచిత ప్రయాణం ఆటో కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.3వేల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మహేష్, కోకన్వీనర్ భిక్షం, శంకర్, నాగార్జున, యాదగిరి, రామాంజనేయులు, యాదయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యురాలిగా శైలజ



దావా శైలజ

చింతపల్లి : మండలంలోని కుర్రంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు, గ్రామ మాజీ సర్పంచ్ దావా శైలజ శ్రీనివాస్ సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.